# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 114 | పేజీలు : 08 | గురువారం | 30-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




2

## బీఆర్ఎస్ ఎన్నారై కమిటీలన్నీ రద్దు

- పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేసే దిశగా కేసీఆర్
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నారై కమిటీలన్నీ రద్దు
- సభ్యత్వాల నమోదు తర్వాత కొత్త కమిటీల నియామకం



2

## నేను మంత్రి పదవి అడగలేదు

- తనకు మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదన్న కోదండరాం
- కేసీఆర్ హయాంలో అందరూ భయంతో బతికారని వెల్లడి
- మార్పు కోసమే తాము పార్టీ నడుపుతున్నామన్న టీజేఎస్ అధినేత



హైదరాబాద్ మెట్రో ఇక తెలంగాణ ప్రభుత్వానిదే

ఎల్ అండ్ టీతో పూర్తయిన షేర్ల కొనుగోలు ఒప్పందం ప్రక్రియ

రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ

మెట్రో ఫేజ్-1 ప్రభుత్వ స్వాధీనంతో మెట్రో ఫేజ్-2కు మార్గం సుగమం

# మెట్రో : ప్రభుత్వ పరం

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్వాధీనం చేసుకుంది. పలు చర్చల అనంతరం లార్సన్ అండ్ టూబ్రో లిమిటెడ్, హైదారాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఎల్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్‌కు ఉన్న వంద శాతం షేర్లను రూ. 1,461.47 కోట్ల ఈక్విటీ విలువకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ ఒప్పందంపై హెచ్‌ఎంఆర్‌ఎల్ తరపున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్‌అండ్‌టీ లిమిటెడ్ తరపున డీకే సేన్, హెచ్‌ఎంఆర్‌ఎల్ తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి మెట్రో రైలును స్వాధీనం చేసుకునే ఒప్పందానికి ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎల్ అండ్ టీ ఛైర్మన్, ఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పలు అంశాలపై సిఎం రేవంత్ రెడ్డి సుబ్రహ్మణ్యన్ మధ్య చర్చలు జరిగాయి. అనంతరం మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-1ను

# ఎన్నికల తర్వాత కుంభకర్ణుడయ్యాడు

- రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ: కేటీఆర్
- రేవంత్ రెడ్డి తాను మారిన మనిషినని చెబుతున్నారన్న కేటీఆర్
- ఎన్నికల తర్వాత కుంభకర్ణుడయ్యాడు కాబట్టి ఆయన చెప్పింది నిజమేనని చురక
- ఈ దుర్మార్గపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకోవాలన్న కేటీఆర్



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తాను మారిన మనిషినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయన చెప్పినదాంట్లో నిజం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీరశూరకర్ణ అయితే, ఎన్నికల తర్వాత కుంభకర్ణుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీలకు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఆయన పాలమూరు బిడ్డ, ఇప్పుడు కనీసం పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డ అని ఎద్దేవా చేశారు. నాగర్ కర్నూలు, పాలమూరులలోనే రైతులు రోడ్డెక్కి

## ఇక నుంచి నేను మంచివాడిగా ఉండబోను

రైఫిల్ పట్టుకుని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక!

- చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించడం లేదని విమర్శ
- అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని వ్యాఖ్య
- ఈ విషయంలో వారు తెలివిగా వ్యవహరిస్తే బాగుంటుందన్న ట్రంప్



2

# విజయం ఖాయం


- బంగాల్ తో సహా 4 రాష్ట్రాలు, యూటీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం: ప్రధాని మోదీ
- ఓటింగ్‌లో చురుగ్గా పాల్గొంటున్న ప్రజలకు అభినందనలు
- మే 4న ఫలితాలు వికసిత భారత్ సంకల్పాన్ని బలోపేతం చేస్తాయి
- డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల యూపీ అభివృద్ధిపథంలో సాగుతోంది
- ప్రధాని మోదీ వ్యాఖ్యలు

హైదరాబాద్ పల్స్,డెస్క్

ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి విజయం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. కేరళ, తమిళనాడు, అసోం, బంగాల్, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ఎన్నికల్లో విజయం తమదేనని పేర్కొన్నారు. బుధవారం బంగాల్ రెండో దశ ఎన్నికల్లో ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొనడాన్ని ఆయన ప్రశంసించారు. ప్రజాస్వామ్య పండుగల్లో ఇది ఒక ముఖ్యమైన రోజు అని అభివర్ణించారు. ఉత్తర్‌ప్రదేశ్ లోని హర్దోయ్‌లో గంగా ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో



2



2

## 5 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

- పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు జూన్
- 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదల
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఏప్రిల్ 30 నుంచి పరీక్ష ఫీజు చెల్లింపులు
- రీకౌంటింగ్ కోసం రూ.500 రీవెరిఫికేషన్ కోసం రూ.1,000 ఫీజు

## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది ఒకటని విమర్శ
- వరిధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా కొనుగోళ్లు
- ప్రారంభించలేదని విమర్శ సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది మరొకటని విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ..

## మోదీని కలిస్తే బీజేపీలో చేరుతున్నట్లా?

మీడియా ప్రతినిధుల ప్రశ్నకు మల్లారెడ్డి అసహనం



2

## పదో తరగతి ఫలితాలు విడుదల

- 95.15శాతం ఉత్తీర్ణత
- బాలికలే ముందంజ
- ములుగు జిల్లా టాప్
- జూన్ 5 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో నిర్వహించిన ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది మొత్తం 95.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 5,26,166 మంది పరీక్షలకు హాజరుకాగా, 4,97,312 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 96.26 శాతం, బాలురు 94.07 శాతం ఉత్తీర్ణతతో, బాలికలు 2.19 శాతం ఆధిక్యం సాధించారు. ఎస్ఎస్‌సీ పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించగా, సమాధాన పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 23 నాటికి పూర్తయ్యింది.



2

## బెంగాల్‌లో మేం గెలుస్తున్నాం

కోల్‌కతాలో ఓటేసిన అనంతరం మమతా బెనర్జీ

విజయ చిహ్నం చూపించిన మమతా బెనర్జీ

మూడింట రెండొంతుల సీట్లు సాధిస్తామని ధీమా

వారు (బీజేపీ) ఓడిపోతున్నారు, టీఎంసీ గెలుస్తుందన్న మమతా బెనర్జీ

## రేవంత్ రెడ్డికి నాకు వ్యక్తిగత పంచాయతీ లేదు

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 'అధికారం రావడం, పోవడం రొటీన్‌గా జరిగేదే. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. కానీ.. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించాలి. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతో పాటు.. బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయి. అధికారం మనకేమీ కొత్త కాదు' అని మాజీ మంత్రి అన్నారు. గత ఎన్నికల సమయంలో



2

# బీఆర్ఎస్ ఎన్నారై కమిటీలన్నీ రద్దు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేయాలన్న అధినేత కేసీఆర్ వ్యూహంలో భాగంగా ఇప్పుడు ఎన్నారై విభాగంలో కూడా పెను మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని బీఆర్ఎస్ ఎన్నారై కమిటీలను రద్దు చేస్తున్నట్లు పార్టీ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల ప్రకటించారు.పార్టీని మరింత పకడ్బందీగా, పద్ధతిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ఈ రద్దు నిర్ణయం తీసుకున్నారు. పాత కమిటీల స్థానంలో కొత్త రక్తంతో, మరింత ఉత్సాహంగా పనిచేసేలా విభాగాలను పునర్నిర్మిస్తున్నారు. త్వరలోనే విదేశాల్లో ఉన్న పార్టీ మద్దతుదారుల కోసం 'సమగ్ర సభ్యత్వ నమోదు' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాతే, కొత్త నిబంధనల ప్రకారం కొత్త కమిటీలను నియమిస్తారు.ఈ పరివర్తన సమయంలో ఎన్నారై సభ్యులు, మద్దతుదారులు సంయమనంతో ఉండి పార్టీ నాయకత్వానికి సహకరించాలని మహేశ్ బిగాల కోరారు.

# రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

మొదటి పేజీ తరువాయి

చెప్పిన రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని ఆరోపించారు. పంటల కొనుగోళ్లకు సంబంధించి ఆయన ఈ లేఖను రాశారు. గతంలో తాలు పేరిట తరుగు తీస్తే తోలుతీస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా, ఇంకా కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎండల్లో రైతులు మాడిపోతున్నా ప్రభుత్వానికి సోయిలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.పొద్దుతిరుగుడు రైతుల కష్టాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పట్టదా? అని నిలదీశారు. 20 రోజులుగా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కేంద్రం కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంట పావు వంతు మాత్రమేనని అన్నారు. మిగిలిన 1.20 లక్షల క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనగ రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు శనిలా మారాయని అన్నారు. అనవసర కారణాలతో కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారని అన్నారు.శనగలకు మద్దతు ధర రూ.5,875 ఉంటే, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు మూడు నాలుగు వేల రూపాయలకే రైతులు అమ్ముకునే దుస్థితి వచ్చిందని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర రూ.3,370 ఉంటే ప్రైవేటు వ్యక్తులకు రూ.2,500కు రైతులు అమ్మవలసిన పరిస్థితి వస్తోందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు నిబంధనను సడలించాలని కోరారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హరీశ్ రావు పేర్కొన్నారు.

# నేను మంత్రి పదవి అడగలేదు

మొదటి పేజీ తరువాయి

తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, తాను కూడా అడగలేదని టీజేఎస్ అధినేత కోదండరాం స్పష్టం చేశారు. అయితే, తన పార్టీ నాయకులకు ప్రభుత్వం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన బహిరంగంగానే చెప్పారు.కేసీఆర్ హయాంలో ప్రజలు మరియు నాయకులు ఒక రకమైన 'భయం' నీడలో బతికారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, "ఇంట్లో ఫోన్ పెట్టి జాగ్రత్తగా రమ్మనే పరిస్థితి ఉండేది" అని వ్యాఖ్యానించారు.కేసీఆర్ ప్రజల నుంచి దూరమయ్యారని, అందుకే ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక కవిత కొత్త పార్టీ పెట్టిన నేపథ్యంలో స్పందిస్తూ.. ఆమె తన మాటల ద్వారా కుటుంబ లోపాలను బయటపెడుతున్నారని, పార్టీ అంటే కేవలం కుటుంబమే అని ఆమె చర్యలు నిరూపిస్తున్నాయని విమర్శించారు.తాము కేవలం ఎన్నికల కోసం కాకుండా 'మార్పు' కోసం పార్టీని నడుపుతున్నామని, అయితే అన్ని ఎన్నికలకూ దూరంగా ఉండలేమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో (బహుశా మున్సిపల్ లేదా జీహెచ్ఎంసీ) కచ్చితంగా పోటీ చేస్తామని, ముందుగానే నియోజకవర్గాలను ఎంచుకుని పనిచేస్తామని ప్రకటించారు.

# 5 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల్లో 95.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ క్రమంలో ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌తో పాటు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ వివరాలను వెల్లడించింది.అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 5వ తేదీన ప్రారంభమై జూన్ 12వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తారు.అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఏప్రిల్ 30 నుంచి మే 14వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్ ఫీజు ఒక సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు ఒక సబ్జెక్టుకు రూ.1000 ఫీజు ఉంటుంది.

# ఎన్నికల తర్వాత కుంభకర్ణుడయ్యాడు

మొదటి పేజీ తరువాయి

ఆందోళనలు చేస్తుంటే సిగ్గనిపించడం లేదా అని మండిపడ్డారు. విద్యుత్ ఇవ్వడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, రైతు బంధు ఖాతాల్లో పడటం లేదని, వీటికి ఆయనకు సిగ్గనిపించడం లేదా అని ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ నాయకులు తిడుతుంటే తనకు పైశాచిక ఆనందం వస్తుందని రేవంత్ రెడ్డి చెబుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల్లో ఉండే సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. మరో సంవత్సరం తర్వాత రేవంత్ రెడ్డి చెబితే, కూర్చున్న కుక్క కూడా లేవదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్మార్గపు, అరాచకపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకుంటే, చివరి ఏడాది అంతా ఎన్నికల హడావుడి ఉంటుందని అన్నారు

# ఇక నుంచి నేను మంచివాడిగా ఉండబోను

మొదటి పేజీ తరువాయి

ఇక నుంచి తాను మంచివాడిగా ఉండనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటూ, తాను రైఫిల్ పట్టుకున్నట్లు ఉన్న ఫొటోను ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఆ దేశానికి ఆయన మరోసారి హెచ్చరిక జారీ చేశారు. చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని విమర్శించారు. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని అన్నారు.ఈ విషయంలో వారు తెలివిగా వ్యవహరిస్తే బాగుంటుందని అన్నారు. ఇక మీదట తాను అంత మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంబన నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.

# పదో తరగతి ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

మొత్తం హాజరైన వారిలో 5,16,815 మంది రెగ్యులర్, 9,351 మంది ఒక సారి ఫెయిల్ అయిన అభ్యర్థులు ఉన్నారు. వీరిలో రెగ్యులర్‌లో 4,91,774 మంది, ఒకసారి ఫెయిల్ అయిన 5,538 మంది ఉత్తీర్ణత సాధించారు.

### టాప్ లో ములుగు జిల్లా

రాష్ట్రవ్యాప్తంగా 5,731 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించగా, కేవలం 6 పాఠశాలలు 0 శాతం ఫలితాలు నమోదు చేశాయి. జిల్లాల వారీగా ములుగు జిల్లా 99.30శాతంతో అగ్రస్థానంలో నిలవగా, హైదరాబాద్ జిల్లా 89.23శాతంతో చివరిస్థానంలో ఉంది. పాఠశాలల నిర్వహణ పరంగా చూస్తే సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు 99.1శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచాయి. రాష్ట్ర రెసిడెన్షియల్, బీసీ, ట్రైబల్, మైనారిటీ, కేజీబీవీ, మోడల్, ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన ఫలితాలు సాధించాయి.

**సబ్జెక్ట్ వారీగా ఉత్తీర్ణత**

విషయాల వారీగా పరిశీలిస్తే ఫస్ట్ లాంగ్వేజ్ - 99.12శాతం సెకండ్ లాంగ్వేజ్ - 99.97శాతం థర్డ్ లాంగ్వేజ్ - 98.98శాతం గణితం - 97.46శాతం జనరల్ సైన్స్ - 98.41శాతం సోషల్ స్టడీస్ - 99.61శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంగ్లీష్ మీడియంలో 95.86శాతం, తెలుగు మీడియంలో 89.14శాతం, ఉర్దూ మీడియంలో 86.71శాతం ఉత్తీర్ణత నమోదైంది.

**ఫలితాలు - రీకౌంటింగ్**

విద్యార్థులు ఫలితాలను అధికారిక వెబ్‌సైట్లతో పాటు మీ సేవ, వాట్సాప్ ద్వారా కూడా పొందవచ్చు. వాట్సాప్ కోసం 8096958096 నంబర్‌కు "ఎఅ" పంపాలి. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఏప్రిల్ 30 నుంచి మే 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.1000 ఫీజు నిర్ణయించారు. అడ్వాన్స్డ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 5 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మోదీని కలిస్తే బీజేపీలో చేరుతున్నట్లా?

మొదటి పేజీ తరువాయి

"మీరు బీజేపీలో చేరుతున్నారా" అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బీఆర్ఎస్ నాయకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసేందుకు వెళితే బీజేపీలో చేరుతున్నట్లా? అని అసహనం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ యువ నాయకుడు టింకు గౌడ్ ఆధ్వర్యంలో బోయినపల్లిలో జరిగిన పలు సేవా కార్యక్రమాల్లో మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుమట్టి, మీరు ప్రధాని మోదీని కలవడంతో బీజేపీలోకి వెళతారనే హాట్ టాపిక్ నడుస్తోంది కదా, మీరేమంటారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు.మల్లారెడ్డి స్పందిస్తూ, అది హాట్ టాపిక్ ఏమిటి, ప్రధానిని కలిస్తే బీజేపీలో చేరుతారా, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారానికి తాను స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. బయట జరిగే ప్రచారంతో తనకు సంబంధం లేదని అన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు.

# విజయం ఖాయం

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్న మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు."ప్రజాస్వామ్య పండుగలో ఇవాళ కీలకమైన రోజు. బంగాల్‌లో రెండో దశ పోలింగ్ కొనసాగుతోంది. మొదటి దశ మాదిరిగానే ప్రజలు పెద్ద ఎత్తున ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఓటు వేస్తున్నారు. సోషల్ మీడియాలో పొడవైన క్యూల దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బంగాల్ లో భయరహిత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయి. కానీ, గతంలో అలాంటి పరిస్థితి ఉండేది కాదు. ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యం బలపడుతుండడానికి నిదర్శనం. రికార్డు స్థాయిలో ఓటింగ్ లో పాల్గొంటున్న ఓటర్లకు నా అభినందనలు" అని ప్రధాని పేర్కొన్నారు.

'ఎన్నికల ఫలితాలతో వికసిత్ భారత్ సంకల్పం బలోపేతం'

ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ-ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించిందని ప్రధాని గుర్తు చేశారు. ఈ క్రమంలో వరుసగా మూడో విజయాన్ని కూడా నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, గుజరాత్‌లో మున్సిపాలిటీలు, జిల్లా పంచాయతీలు, నగర పంచాయతీల్లో 80 నుంచి 85 శాతం స్థానాలను బీజేపీ గెలుచుకుందని కూడా మోదీ చెప్పారు. అయితే, మే 4న వెలువడనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వికసిత్ భారత్ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. అవి దేశాభివృద్ధి వేగానికి కొత్త శక్తి ఇవ్వనున్నాయని అన్నారు.మరోవైపు, కాంగ్రెస్?, సమాజ్? వాదీ పార్టీలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్? కల్పించే నారీ శక్తి బిల్లు ఇరుపార్టీలు వ్యతిరేకించాయని మండిపడ్డారు. ఆ పార్టీలు అభివృద్ధికి, మహిళలకు వ్యతిరేకమన్నారు. ఒకవేళ బిల్లు ఆమోదం పొంది ఉంటే, 2029 ఎన్నికల తర్వాత లోక్?సభ, రాష్ట్రశాసన సభల్లో మహిళలకు రిజర్వేషన్లు లభించేవన్నారు. ఇతర ఏ కేటగిరీలో సీట్లను తగ్గించకుండానే, పెద్ద సంఖ్యలో మహిళలు ఎన్నికై దిల్లీకి చేరుకునేవారని పేర్కొన్నారు. అయితే, సమాజ్ వాదీ పార్టీ, దాని మిత్రపక్షాలు పట్ల యూపీ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని వ్యాఖ్యానించారు.

'గతంలో యూపీని బిమారు రాష్ట్రంగా పిలిచేవారు'

అలాగే, బీజేపీ హయాంలో జరిగిన ఉత్తర్?ప్రదేశ్ అభివృద్ధి గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఒకప్పుడు గుంతల రోడ్లకు గుర్తింపు పొందిన ఉత్తర్‌ప్రదేశ్, ఇప్పుడు అత్యధిక ఎక్స్‌ప్రెస్ వేలు కలిగిన రాష్ట్రంగా మారుతోందని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల యూపీ అభివృద్ధిపథంలో సాగుతోందని ప్రధాని తెలిపారు."గత ప్రభుత్వాలు హర్దోయ్, ఉన్నావ్ లాంటి జిల్లాల్లో పారిశ్రామిక కారిడారు ఏర్పాటు చేయాలని ఆలోచన చేసేవా? హర్దోయ్ నుంచి కూడా ఎక్స్‌ప్రెస్ వే వెళ్తుందని ఎవరైనా ఊహించారా? ఈ పనులు బీజేపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతాయి. గతంలో యూపీని వెనకబడిన (బిమారు) రాష్ట్రంగా పిలిచేవారు. అదే ఉత్తర్‌ప్రదేశ్ నేడు ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థికవ్యవస్థ దిశగా సాగుతోంది. ఇది పెద్ద లక్ష్యమే. దీని వెనుక అంతే పెద్ద సన్నద్ధత కూడా ఉంది. యూపీ వద్ద అసమానమైన శక్తి ఉంది. దేశంలో అతిపెద్ద యువశక్తి యూపీ వద్ద ఉంది. ఈ శక్తితో యూపీని మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చబోతున్నాం. యూపీలో కొత్త ఉద్యోగాలు, పరిశ్రమలు ఏర్పాటవుతాయి. పెద్దఎత్తున వచ్చే పెట్టుబడుల ద్వారా ఆర్థిక ప్రగతి ద్వారాలు తెరుచుకుంటాయి. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని ప్రధాని పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డికి నాకు వ్యక్తిగత పంచాయతీ లేదు

మొదటి పేజీ తరువాయి

ప్రజలకు కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడవద్దని, ఆగమై ఓటు వేయొద్దని అన్నారని మాజీ మంత్రి తెలిపారు. రేవంత్ రెడ్డికి.. తనకు వ్యక్తిగత పంచాయతీ లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించామని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతారని క్లియర్‌గా చెప్పారన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలామంది చెప్పారని తెలిపారు. 2023 తర్వాత బీఆర్ఎస్‌కు చాలా షాక్‌లు తగిలాయన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. కేసీఆర్‌కు రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు' అని కేటీఆర్ తెలిపారు.గతంలో కేసీఆర్ రైతుబంధు ఇస్తుంటే.. ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా అని? పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధును కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని గుర్తుచేశారు. కానీ.. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలన్నారు. చాలా నియోజకవర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు.. ఈ ఎమ్మెల్యే తమకొద్దని అనుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు.

# బెంగాల్‌లో మేం గెలుస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో తన ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అద్భుత విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మూడింట రెండొంతుల మెజారిటీ తమ పార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వారు (బీజేపీ) అన్ని చోట్ల ఓడిపోతారని పేర్కొన్నారు. ఆమె అభిమానులకు, కార్యకర్తలకు విజయ చిహ్నం చూపిస్తూ ఉత్సాహపరిచారు.మమతా బెనర్జీ కేంద్ర బలగాలు, పరిశీలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది, కేంద్ర పరిశీలకులు మహిళలు సహా అందరినీ లక్ష్యంగా చేసుకుంటున్నారని, అమాయకులను కొడుతున్నారని మండిపడ్డారు. మహిళలు, పిల్లలను కూడా వదలడం లేదని ఆరోపించారు. నిన్న రాత్రి నుంచి ఘోరాలకు పాల్పడ్డారని అన్నారు. ఎంతోమంది టీఎంసీ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారని మమతా బెనర్జీ అన్నారు.

# మెట్రో ప్రభుత్వ పరం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఎల్ అండ్ టీ తో గత కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు నిర్వహించింది. ఈ నేపథ్యంలో హెచ్ఎంఆర్ఎల్ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ఎల్ ప్రతినిధులు ఇవాళ రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో లార్సన్ అండ్ టూబ్రో లిమిటెడ్, మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సంస్థలతో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నారు.ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ హామీతో హెచ్ఎంఆర్ఎల్‌పై ఉన్న రూ. 13,538.53 కోట్ల అప్పును (2026, ఏప్రిల్ 30వ తేదీ నాటికి) తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేశారు. ఈ లావాదేవీకి ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా ఐడీబీఐ కేపిటల్ వ్యవహరించగా, లీగల్ అడ్వైజరీ సేవలను సరఫ్ అండ్ పార్ట్నర్స్ సంస్థ అందించింది.హైదరాబాద్‌లో ఎల్?అండ్?టీ, మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సంస్థ 2017, నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను నిర్మించి నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. మెట్రో ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్-1, ప్రతిపాదిత ఫేజ్-2 నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, ప్రణాళిక, అమలు, సేవల అమలు సమన్వయం సాధ్యమవుతుంది. భవిష్యత్‌లోనూ హైదరాబాద్ నగరానికి మరింత సమగ్ర, ఆధారపడదగిన, ప్రయాణికులకు అనుకూలమైన మెట్రో రైలు నెట్‌వర్క్ ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# డోర్నకల్‌లో విద్యా రంగంలో దూసుకెళ్తున్న బ్రిలియంట్ హై స్కూల్

**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలంలో బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాలు బ్రిలియంట్ హై స్కూల్‌కు మరొక గౌరవాన్ని తీసుకువచ్చాయి. ఈ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి మండల స్థాయిలో తమ ప్రతిభను మరోసారి నిరూపించారు. విద్యార్థిని సంకీర్తన (సృజన) 600 మార్కులకు గాను 580 మార్కులు సాధించి మండలంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆమెతో పాటు మేఘన 572 మార్కులు, అమూల్య 571 మార్కులు సాధించి ఉన్నత ర్యాంకులతో నిలిచి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు. విద్యార్థుల ఈ విజయాల వెనుక క్రమశిక్షణతో కూడిన చదువు, నిరంతర సాధన, ఉపాధ్యాయుల నిబద్ధతతో కూడిన బోధన ప్రధాన కారణాలుగా నిలిచాయని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా సంకీర్తన సాధించిన ఫలితం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఫలితాలతో బ్రిలియంట్ హై స్కూల్ డోర్నకల్ మండలంలో అగ్రగామి విద్యాసంస్థగా నిలిచి తన ప్రత్యేకతను మరోసారి చాటుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వకంతుల అప్పారావు, ప్రిన్సిపాల్ అప్సర బేగం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించి వారి భవిష్యత్తు విజయాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వకంతుల అప్పారావు మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు విలువల బోధనకు తమ పాఠశాల కట్టుబడి ఉందని, విద్యార్థుల సమగ్రాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.



# మహబూబాబాద్‌లో ఎక్సైజ్ దాడులు... భారీగా నల్ల బెల్లం, పటిక స్వాధీనం

**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ జిల్లాను గుడుంబా, డ్రగ్స్ రహితంగా మార్చే లక్ష్యంతో ఎక్సైజ్ శాఖ చేపట్టిన ప్రత్యేక చర్యలు జిల్లాలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ నుండి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బృందాలతో కలిసి ముత్యాలమ్మగూడెం (బోడగుట్ట తండా క్రాస్) వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో గూడూరు వైపు నుండి వస్తున్న నంబర్ లేని ఒక నాలుగు చక్రాల వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా, అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు వాహనాన్ని ఆపకుండా బయ్యారం దిశగా పారిపోయారు. అధికారులు వెంటాడగా, నిందితులు ఉప్పారపాడు గ్రామం సమీపంలో వాహనాన్ని వదిలి పరారయ్యారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 1500 కిలోల నల్ల బెల్లం, 150 కిలోల పటిక, 10 లీటర్ల నాటు సారా లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ చిరంజీవి మాట్లాడుతూ, గుడుంబా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నాటు సారా తయారీ, విక్రయం, రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు నిరంతరం నిఘా పెంచుతున్నాయని తెలిపారు. అలాగే గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలపై కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. రాష్ట్రాన్ని గుడుంబా, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రజలు, యువత, మీడియా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు



# రైతు ముంగిట 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

## పెనగడపలో ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
కొత్తగూడెం నియోజకవర్గానికి ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని, రైతుల కష్టాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నామని, అందుబాటులోకి వచ్చిన ఈ 22 కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. బుధవారం చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామంలో నూతనంగా మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ. రైతుల కష్టాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కృషితో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో కేంద్రాలను మంజూరు చేయించామని తెలిపారు. అధికారులు, ఐకేపి సిబ్బంది కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, ముఖ్యంగా తూకం విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు, తేమపేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, సరిపడ గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజ ఐకేపీ ద్వారా కొనుగోలు జరుగుతుందని, దళారుల మాయమాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని కోరారు. కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం విక్రయించిన అనంతరం రైతుల ఖాతాల్లోకి సకాలంలో నిధులు జమ అయ్యేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రైతు పక్షపాతిగా ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, నాయకులు నీడలా సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాధం, తాజుద్దీన్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లాను ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆయన సూచనలు చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి కలెక్టర్ రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించారు. ముఖ్యంగా నేషనల్ హైవే-65 పై నిర్వహణ లోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.యూ-టర్న్‌ల వద్ద భద్రతా చర్యలు, లైటింగ్, రేడియం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే జంక్షన్‌ల వద్ద పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చేవెళ్ల ఘటన నేపథ్యంలో సీజ్ చేసిన వాహనాల వివరాల నివేదికను జిల్లా రవాణా అధికారి సమర్పించాలని కోరారు.నేషనల్ హైవేలు, ప్రధాన రహదారులపై పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. పోలీసు శాఖ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్ అ బి, పోలీస్, మున్సిపల్, హెల్త్ శాఖల అధికారులు, నేషనల్ హైవే ప్రతినిధులు పాల్గొన్నారు.




# డీజీల్ - పెట్రోల్ కొరత ను నివారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

**డీజీల్ దొరకక పోవడంతో రవాణా, వరి కోత, వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయి**

**అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భారతదేశంలో డీజిల్ పెట్రోల్ దొరకక వ్యవసాయ పనులు నిలిచిపోయింది అని, రవాణా స్థభించిపోయిందని, డీజిల్ లేక ట్రాక్టర్ లు, వరి కోత యంత్రాలు ఆగిపోయాయని, ఆటో నడవక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెట్రోల్ డీజిల్ నివారించాలని బేజాడి కుమార్ మాట్లాడుతూ దేశశీలో నేడు డీజిల్, పెట్రోల్ దొరకక పోవడంతో వ్యవసాయ పనులు ఎక్కడికి అక్కడ నిలిచిపోయిందని, రవాణా వ్యవస్థ ద్విచక్రా వాహనాలు నిలిచిపోయిందని, వరికోత, రైస్ మిల్లులు డీజిల్ లేక పనులు ఆగిపోయిందని, ఇదే అవకాశం గా భావించిన కొంత మంది బ్లాక్ లో డీజిల్ లీటర్ 300 రూపాయలు చొప్పున అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా బెంగాల్, కేరళ ఎన్నికల ప్రచారంలో మునుగుతున్నారని, దేశంలో డీజిల్, పెట్రోల్ కొరతను నివారించాల్సిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి ఇరాన్ మీద దాడి చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం మాత్రం అమెరికా కు మద్దత్తు ఇవ్వడం భారత దేశంకు చాలా నష్టం అని, వెంటనే దేశంలో డీజిల్, పెట్రోల్ కొరతను నివారించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



# బీరంగూడలో చలివేంద్రం ప్రారంభించిన కాట శ్రీనివాస్ గౌడ్



**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29:**
బీరంగూడ డివిజన్ పరిధిలోని ఐక్యత హోమ్స్ వద్ద, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తీవ్ర వేసవి పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనాన్ని అందించడమే కాకుండా, సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.

# జనగణనలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొనండి: ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29 :**
జన గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొని దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం పటాన్చెరులోని తన నివాసంలో స్వీయ జన గణనను ప్రారంభించారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి జనగణన ఎంతో కీలకమని.. ఖచ్చితమైన వివరాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం సమర్థవంతమైన సంక్షేమ పథకాలు రూపొందించడంలో ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించడం ద్వారా జనగణన ప్రక్రియ మరింత సులభతరమైందన్నారు. ప్రజలు యాప్ ద్వారా స్వీయ జనగణన సైతం చేసుకోవచ్చని తెలిపారు. అధికారులు ఇళ్లకు వచ్చిన సమయంలో పూర్తి వివరాలు అందించాలని.. ఎటువంటి గోప్యతకు చోటు ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా బడుగు బలహీన వర్గాల జీవన స్థాయి ప్రమాణాలు, వెనుకబాటుతనం, విద్య స్థాయి, తదితర అంశాల పైన స్పష్టమైన సమాచారం లభిస్తుందన్నారు. ప్రజలు అందించే ప్రతి సమాచారం పూర్తి భద్రతతో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఏ ఆర్ ఓ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందుకు గిరిజన ఉపాధ్యాయ సంఘం సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
ఐటీడీఏ-ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారిగా మంద మకరందు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం (టీఎస్‌టీడబ్ల్యూటీయూ) కుంరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా శాఖ తరపున బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించింది. పూలగుచ్ఛం, శాలువా, మెమెంటో అందజేసి నూతన అధికారికి స్వాగతం పలికారు.ఉపాధ్యాయుల సమస్యలు – ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చెందిన పాత సమస్యలు, సిఆర్‌టీల అంశాలు, ఉపాధ్యాయులపై తీసుకున్న చర్యల ఉపసంహరణ, పిఎంఆర్‌సి కార్యాలయాల బలోపేతం వంటి డిమాండ్లను సంఘం నేతలు నేరుగా ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. అన్ని సమస్యలు ఓపికగా విన్న మకరందు, త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. గిరిజన ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం టీఎస్‌టీడబ్ల్యూటీయూ నిరంతరం కృషి చేయాలని కూడా సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శులు నైతం కృష్ణరావ్, మడావి గోపాల్, కోశాధికారి కూడ్మే అనంత్ సహా పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

## ఎస్.ఎస్.సి ఫలితాలలో రఘునాథపురం ఉన్నత పాఠశాల ప్రభంజనం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : ఎస్.ఎస్.సి ఫలితాలలో రాజపేట మండలం రఘునాథపురం ఉన్నత పాఠశాల, ప్రభంజనం సృష్టించింది. ఈ ఫలితాలలో మండల ప్రథమ స్థానాన్ని కీసరి ప్రజ్వల్ 569, తృతీయ స్థానాన్ని శెట్టి భాను శ్రీ 565 పొందగా 550 మార్కులకు పైగా 11 మంది సాధించగా 500 మార్కులకు పైగా 30 మంది సాధించడం విశేషం. ఈ ఫలితాలలో పాఠశాల నుండి బాలురు 29 మంది మరియు బాలికలు 32 మంది మొత్తంగా 61 మంది పరీక్షకు హాజరుకాగా 100% అనగా 61 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. మనోజ్ కుమార్, గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ , గ్రామ పెద్దలు మరియు ఉపాధ్యాయులు అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలతో అభినందించారు. అనంతరం ఇట్టి ఫలితాలను అందించడంలో కృషిచేసిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు కే.మనోజ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కే.శ్రీనివాస చారి, ఎస్.వెంకటేశ్వర్లు, వై.బాలకృష్ణ, టి.శ్రీహరి, ఎన్.కృష్ణమూర్తి పాల్గొని విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

## మేడే జయప్రదం చేయాలి...

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కార్మికుల హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే మేడే (మే 1) రోజును ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం కోరారు.
బుధవారం రాజపేటలో మాట్లాడారు. సమాన వేతనం, భద్రమైన పని వాతావరణం, పని గంటల నియంత్రణ వంటి హక్కులు సులభంగా రాలేదని, కార్మికుల పోరాటాల ఫలితంగా వచ్చాయన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు, యువత, సామాజిక సంస్థలు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కార్మికుల సమస్యలు, కనీస వేతనం, సామాజిక భద్రత, ఆరోగ్య సౌకర్యాలపై చర్చలు జరగాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ర్యాలీలు, సభలు నిర్వహించి కార్మిక ఐక్యతను చాటాలన్నారు. ప్రభుత్వం కూడా కార్మికులకు అనుకూల విధానాలు తీసుకురావాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు, వలస కార్మికులు, అసంఘటిత రంగం కార్మికుల సంక్షేమం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కార్మికుల ఐక్యతే బలం అనే నినాదంతో ఈ మేడే ను జయప్రదం చేసి, సమాన హక్కుల సమాజ నిర్మాణానికి ముందడుగు వేయాలన్నారు.

## అండర్‌ట్రయల్ కేసుల సత్వర పరిష్కారానికి అధికారుల సమన్వయం తప్పనిసరి

### జిల్లా న్యాయమూర్తి వీరయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పేరుకుపోయిన అండర్‌ట్రయల్ కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి ఎ. వీరయ్య ఆదేశించారు. బుధవారం జిల్లా న్యాయస్థాన సముదాయంలో సమీక్షా సమావేశం జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి–జిల్లా న్యాయ సేవ అధికారి వి. సంకేత్ మిత్ర, కలెక్టర్ కె. హరిత, జూనియర్ సివిల్ జడ్జి జె. అనంతలక్ష్మి, ప్రత్యేక సబ్–జైల్ పర్యవేక్షకులు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో న్యాయమూర్తి పలు కీలక అంశాలు స్పష్టం చేశారు. అండర్‌ట్రయల్ కక్షిదారుల వివరాలు క్షుణ్ణంగా నమోదు చేయాలని, చార్జ్‌షీట్ వేసిన, వేయని కేసుల సమాచారం తక్షణమే అప్‌డేట్ చేయాలని సూచించారు. బెయిల్ మంజూరైన వెంటనే నిబంధనలు పాటిస్తూ సంబంధిత వ్యక్తులను విడుదల చేయాలని, ఆలస్యం చేయకూడదని స్పష్టం చేశారు.

## కొమరం భీమ్ ఆసిఫాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 98% ఎస్ఎస్‌సి ఉత్తీర్ణత

### 13 పాఠశాలలు శతశాతం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరం ఎస్ఎస్‌సి ఫలితాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు 98 శాతం ఉత్తీర్ణత సాధించాయని కలెక్టర్ కె. హరిత తెలిపారు. జిల్లాలోని 37 ఆశ్రమ పాఠశాలల్లో పరీక్ష రాసిన 1,302 మంది విద్యార్థుల్లో 1,276 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 531 మంది బాలురు, 745 మంది బాలికలు ఉన్నారు.జైనూర్, కోహినూర్, మహాగావ్, రోంపల్లి, పంగిడిమాదర, సలుగుపల్లి, కమర్‌గావ్, కేతిని, కంచనపల్లి, అనార్‌పల్లి, రాంజీగూడ, సోమిని, పోచంలొద్ది పాఠశాలలు శతశాతం ఫలితాలు నమోదు చేశాయి. టాపర్లలో జైనూర్ బతుకమ్మ పాఠశాల విద్యార్థిని పి. లోకేశ్వరి 542 మార్కులతో జిల్లాలో అగ్రస్థానం సాధించింది. సిర్పూర్–టి ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ఎం. ఆర్థిక, జి. సువర్ణ 537 మార్కులు, జైనూర్ పాఠశాల విద్యార్థిని ఎ. సంధ్యారాణి 535 మార్కులు సాధించారు.ఈ ఉత్తమ ఫలితాల సాధనలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు.

## వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో అవసరం : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బస్ స్టాండ్ సమీపంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బుధవారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో తోడ్పడతాయని ఆయన అన్నారు. అవసరమైన చోట్ల ప్రజల సౌకర్యం చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సేవా నిరతి తో ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత, మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, సిఐ యాలాద్రి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎంఎ ఎజాస్, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, కౌన్సిలర్లు పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, కాంగ్రెస్ నాయకులు ఎంఏస్ విజయ్ కుమార్, నీలం వెంకటస్వామి, చింతకింది మురళి, శికిలం శ్రీనివాస్, బరిగే శ్రీనివాస్, ఆలేటి అనిల్, మల్లెల శ్రీకాంత్, ఎండి ఇమ్రాన్, కాసుల భాస్కర్ పాల్గొన్నారు.

## శ్రీ ఏల్మస శివగంగ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన సోమరాజు గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని బస్టాండ్ ఎదురుగా శ్రీ ఏల్మస శివగంగా వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొప్రైటర్ తాటిపాముల సోమరాజు గౌడ్ మాట్లాడుతూ కొలనుపాక గ్రామంలోని ఆడపిల్ల పెళ్లి చేసే వారికి, వృద్ధులకు, నిరుపేద కుటుంబాలకు, ఉచితంగా వాటర్ ను అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్నలిస్ట్ భైరి విశ్వనాథం గౌడ్, కొలనుపాక గౌడ సంఘం అధ్యక్షులు మాసపేట రాజు గౌడ్, గౌడ సంఘం కోశాధికారి జర్నలిస్ట్ దూడల సాగర్ గౌడ్, భైరి పాపారాజు గౌడ్, నలవాల సోమలింగం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలో ఏకంగా కమలం గుర్తు గాయబ్.. ఫాల్టాలో రీపోలింగ్‌కు బీజేపీ డిమాండ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, సెంట్రల్ డెస్క్ :**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ రణరంగంగా మారింది. డైమండ్ హార్బర్ లోక్‌సభ పరిధిలోని ఫాల్టా నియోజకవర్గంలో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని ప్రధాన ప్రతిపక్షం బీజేపీ ఆరోపించడంతో తీవ్ర కలకలం రేపుతోంది. ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్ తరపున జహంగీర్ ఖాన్ బరిలో ఉన్నారు.

**బటన్లపై డబుల్ టేపులు.. ఓటర్ల అభ్యంతరం**

ఫాల్టా నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలపై బీజేపీ గుర్తు ఉన్న బటన్‌ను కనిపించకుండా డబుల్ టేపులు అంటించారని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు. ఓటర్లు కమలం గుర్తుకు ఓటు వేయకుండా అడ్డుకునేందుకే టీఎంసీ 'డైమండ్ హార్బర్ మోడల్' కుట్రకు పాల్పడిందని ఆయన మండిపడ్డారు. దీనికి సంబంధించిన వీడియోలను ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుంది. పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి దీనిపై విచారణకు ఆదేశించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగినట్లు నిర్ధారణ అయితే, ప్రభావిత బూత్‌లలో రీపోలింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఫాల్టా నియోజకవర్గంలోని 144, 170, 189 బూత్‌లపై స్పెషల్ ఫోక్ పెట్టారు.

## వెన్నారం గ్రామానికి గర్వకారణం.. పదో తరగతిలో బయ్యు సంజన అద్భుత ఫలితం



**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 29 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామానికి చెందిన బయ్యు సంజన పదో తరగతి ఫలితాల్లో మెరిసి గ్రామానికి కీర్తి తీసుకొచ్చింది. తాజాగా విడుదలైన ఫలితాల్లో ఆమె ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. ములుగు జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతి రావు ,పాఠశాలలో చదువుతున్న సంజన, 600 మార్కులకు గాను 547 మార్కులు సాధించి అత్యుత్తమ ఫలితాన్ని నమోదు చేసింది. పట్టుదలతో చదువుతూ సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు ప్రశంసలు కురిపించారు. ఈ విజయంతో సంజన కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. తల్లిదండ్రులు నాగరాజు కుమార్తెపై గర్వం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు సంజనను అభినందిస్తూ, ఆమె మరింత ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఆశీర్వదించారు.

## అందరికీ ఆధార్ కార్డు తప్పనిసరి : కలెక్టర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని కలెక్టర్ హరిత స్పష్టం చేశారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ భవనంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్, అదనపు ఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, యూఐడీఏఐ స్టేట్ అసిస్టెంట్ మేనేజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ పలు కీలక అంశాలు ప్రస్తావించారు. జిల్లాలో 5 నుండి 15 సంవత్సరాల మధ్య వయసు 13,781 మంది విద్యార్థులు, 15 సంవత్సరాలు దాటిన 5,130 మంది విద్యార్థులు ఇంకా ఆధార్ అప్‌డేట్ చేసుకోలేదని తెలిపారు. నీట్, ఎంసెట్, పోటీ పరీక్షలకు బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లో ఉన్నందున ఆధార్ అప్‌డేట్ చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పీవీటీజీ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేయాలని, పుట్టిన తేదీ రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో పనిచేస్తున్న 87 ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం అవసరం : కలెక్టర్ అనురాగ్ జయంతి

## యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక నిఘా...

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మినీ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ఎన్సీఓఆర్డి (నార్కోటిక్స్ కోఆర్డినేషన్) సమావేశంలో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణతో కలిసి సమీక్ష నిర్వహించారు. డ్రగ్స్‌కు సంబంధించిన అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ కళాశాలలు, క్రీడా పోటీల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. గ్రామ, వార్డు స్థాయిలో యాంటీ డ్రగ్ కమిటీలకు బలోపేతం. విద్యాసంస్థల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు. ప్రత్యేక క్యాలెండర్‌తో అవగాహన చర్యలు. ఎక్సైజ్ శాఖ ద్వారా కఠిన తనిఖీలు. జిల్లా విద్యా అధికారి ద్వారా విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక నష్టాలను వివరించాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ సరఫరా, నిల్వ, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ కాలేజీలు, ఫ్యాక్టరీలు, గ్రామాల్లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించాలని, యువత దుష్ప్రవర్తనలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్



సూపరింటెండెంట్ విష్ణుమూర్తి, డీఈవో సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ, జిల్లా వైద్యాధికారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లి లలితక్క యాదవ్ జయంతి వేడుకలు

## ఐక్యతే బలం - యాదవ సమాజానికి పిలుపు

**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
తెలంగాణ ఉద్యమంలో తన గాత్రంతో ప్రజల్లో చైతన్యం రగిలించిన గాన కోకిల బెల్లి లలితక్క యాదవ్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా యాదవ సమాజం నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె పోరాట స్ఫూర్తి, త్యాగం ఎప్పటికీ మరువలేనివని పేర్కొంటూ, సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 1997లో భువనగిరి సభలో తన ఉద్యమ గీతాలతో ప్రజలను ఉత్సాహపరిచిన లలితక్క, తెలంగాణ ఆవిర్భావ పోరాటంలో విశిష్ట పాత్ర పోషించారు. తన పాటల ద్వారా ఉద్యమానికి కొత్త ఊపునిచ్చి, ప్రజల్లో అవగాహన పెంచిన ఆమెను తెలంగాణ గాన కోకిలగా గుర్తిస్తున్నారు. 1999లో జరిగిన దారుణ హత్యలో ఆమె ప్రాణాలు కోల్పోవడం రాష్ట్రాన్ని కుదిపేసిన ఘటనగా నిలిచింది. అయినప్పటికీ ఆమె త్యాగం వృథా కాలేదని, తెలంగాణ సాధనలో ఆమె సేవలు చిరస్థాయిగా నిలిచాయని నాయకులు గుర్తుచేశారు. బుధవారం భారత యాదవ సమితి జాతీయ అధ్యక్షులు దాసరి నాగేష్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు చెరుకూరి శేఖర్ యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అరికెల పద్మా యాదవ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాని యాదవ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ, బెల్లి లలితక్క ఆశయాలను కొనసాగిస్తూ యాదవ సమాజం ఐక్యతతో అభివృద్ధి దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. జక్కుల సురేష్ ,



లలితక్కకు జోహార్లు అర్పించారు. జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న వారు "జై యాదవ్ -- జైజై యాదవ్" నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగిస్తూ, ఆమె త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# రాజపేట మండలంలో అన్నీ ప్రభుత్వ పాఠశాలలు రికార్డులే..



ప్రథమ స్థానం ప్రజ్వల్, రఘునాథపూర్
569 మార్కులు



ద్వితీయ స్థానం జి. స్రవంతి, చల్లూరు
మార్కులు 567



తృతీయ స్థానం ఎస్. భానుశ్రీ
రఘునాథపూర్ మార్కులు 565

**ఎంఈఓ చందా రమేష్ ఆధ్వర్యంలో సంచలన ఫలితాలు...**
**నూరు శాతం విద్యార్థుల హాజరు, నూరు శాతం ఉత్తీర్ణత......**
**ప్రత్యేకంగా అభినందించిన జిల్లా విద్యాధికారి కందుల.....**
**ఆనందోత్సాహంలో ప్రభుత్వ పాఠశాలలు......**
**రాష్టంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన రాజపేట మండలం ఫలితాలు....**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఎస్ఎస్సి పరీక్ష ఫలితాలు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపుగా రాజపేట మండలంలో అన్నీ ప్రభుత్వ పాఠశాలలు రికార్డు ఫలితాలు ఉన్నాయి. 100% విద్యార్థులు హాజరు కావడమే కాకుండా 100% ఉత్తీర్ణత ఉత్తమ ఫలితాలతో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నాయి. ఎంఈఓ చందా రమేష్ ఆధ్వర్యంలో విద్యా సంవత్సరం మొదటి నుండి ప్రత్యేక శ్రద్ధ ప్రణాళికతో ముందుకెళ్లడంతో నూరు శాతం హాజరు శాతం ఉత్తీర్ణత పొందడంతో జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. 3 సెంటర్లలో విద్యార్థులు 433 మంది 100% హాజరు అయ్యారు. పీఎం శ్రీ రాజపేట కేంద్రంలో 188 మంది విద్యార్థులు, రాజపేట బాలికల ఉన్నత పాఠశాల కేంద్రం లో 152 మంది విద్యార్థులు, రఘునాథపూర్ పరీక్షా కేంద్రంలో 93 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాజపేటలో ఇద్దరు సీ.ఎస్.డబ్ల్యు.ఎన్. విద్యార్థులకు ఈ సబ్జెక్ట్ లో మినహాయింపు కలదు. మండల తహసీల్దార్ మూడు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా మూడు పరీక్షా కేంద్రాలను సందర్శించి సంతృప్తి చెందారు. వారిరువురి వెంట ఎంఈఓ చందా రమేష్ ఉన్నారు. ఆయా కేంద్రాలలో గల పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ లు తడ్క రాజు , కె. మనోజ్ కుమార్, జే. ప్రభాకర్ లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ బి. వసంత, ఎస్. విజయలక్ష్మి, బి. పరమేష్ లు పాల్గొన్నారు. ప్రభుత్వం నాలుగు రోజులకొక పరీక్ష నిర్వహణ కూడా సత్ఫలితాలకు కారణమైంది. ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం:పదవ తరగతి ఫలితాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో 100 % విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారు. ఫలితాలు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచిందని, ఇంకా ఉపాధ్యాయులు భాద్యతగా పనిచేయడానికి కృషి చేస్తారని ఎంఈఓ రమేష్ తెలిపారు. ప్రథమ స్థానం ప్రజ్వల్, రఘునాథపూర్ 569 మార్కులు, ద్వితీయ స్థానం జి. స్రవంతి, చల్లూరు మార్కులు 567,తృతీయ స్థానం ఎస్. భానుశ్రీ రఘునాథపూర్ మార్కులు 565,నాల్గోవ స్థానం జి. తేజస్విని,దూది వెంకటాపూర్ మార్కులు 564,ఐదవ స్థానం,బి. రాంతేజ్ రఘునాథపూర్ మార్కులు. 562,ఆరవ స్థానం కె. రిషిత, రాజాపేట మార్కులు 560, ఏడవ స్థానం జి.భావన మాంటిస్సోరి పాఠశాల మార్కులు. 555, ఎనిమిదవ స్థానం, కె.శ్రుతి, జకారియా పాఠశాల మార్కులు. 554, తొమ్మిదవ స్థానం, ఎస్. వైష్ణవి, చల్లూరు మార్కులు. 551, పదవ స్థానం,ఎస్. అక్షయ చల్లూరు మార్కులు 548 సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ రికార్డు స్థాయి ఫలితాలతో ఎంఈఓ చందా రమేష్ ను పలువురు ప్రత్యేకంగా అభినందిస్తూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం సమిష్టి కృషిని ప్రశంసిస్తున్నారు

# గిరిజన విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన

## 1930కి కాల్ చేయాలని సూచన.

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ పాఠశాలలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ తెలియని వ్యక్తులతో స్నేహాలు, వ్యక్తిగత వివరాల పంపకం వల్ల సైబర్ మోసాల ముప్పు పొంచి ఉంటుందని హెచ్చరించారు. ఆన్‌లైన్ గేమ్స్, ఫేక్ లింక్స్, ఫిషింగ్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించారు.డీసీపీఓ మహేష్ మాట్లాడుతూ రీల్స్, అనవసర ఆన్‌లైన్ కార్యకలాపాల్లో సమయం వృథా చేసుకోవద్దని, చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సురక్షిత పాస్‌వర్డుల వినియోగం, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకపోవడం వంటి అంశాలపై నిపుణులు వివరించారు. డీసీపీయూ కౌన్సిలర్ చంద్రశేఖర్, కేస్ వర్కర్ సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పెన్నార్ పరిశ్రమ ప్రమాదంలో బీహార్ యువకుడు మృతి

## ఎమ్మెల్యే జిఎంఆర్ జోక్యంతో 11 లక్షలు పరిహారం!



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29:** సంగరెడ్డి జిల్లా, పెన్నార్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడైన బీహార్ ప్రాంతానికి చెందిన వికేష్ కుమార్ సింగ్ (35) ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. భార్య తరుణ కుమారి, ఇద్దరు పిల్లలు ఉన్న బాధిత కుటుంబానికి శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జోక్యంతో పరిహారం ఇవ్వాలని కాంట్రాక్టర్, యాజమాన్యం ఒప్పుకున్నాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే డి.వి.ఎమ్.సి మెంబర్ మాసనూరి చంద్రశేఖర్, సంజీవ్ పటేల్ (అలియాస్ టింకు) కాంట్రాక్టర్, యాజమాన్యంతో మాట్లాడారు. శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, సంజయ్ గారుల చర్చల్లో తక్షణ ఖర్చులకు రాయిగా 11 లక్షలు, అంతకు ముందు లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు."స్వరాష్ట్రీయులతో పాటు ఉత్తర భారతీయులను కూడా కడుపులో పెట్టుకొని చూసుకుంటామ" అని శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భూగోల్, రవి, గుప్తాజీ, వికాస్ పాల్గొన్నారు.

# చిలుకోడు మోడల్ పాఠశాల పదో తరగతిలో విద్యార్థుల అద్భుత ప్రతిభ




**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలోని మోడల్ పాఠశాల బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థిని కాడెం శర్వరి 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించి మండలంలోనే అగ్రస్థానాన్ని అందుకుంది. కాడెం శర్వరి సాధించిన ఈ విజయంతో పాఠశాల ప్రతిష్ట మరింత పెరిగింది. ఆమెతో పాటు విష్ణువర్ధన్ 549 మార్కులు సాధించి మెరుగైన ఫలితాన్ని నమోదు చేయగా, దేశని యామిని, 535 మార్కులతో మంచి ప్రతిభ కనబరిచింది. ఈ ఫలితాలు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధనకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవడం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం ఈ విజయాలకు ప్రధాన కారణాలని పాఠశాల వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఫలితాలు పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. చిలుకోడు మోడల్ పాఠశాల విద్యార్థుల ఈ అద్భుత ఫలితాలు ప్రస్తుతం ప్రాంతవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటూ, ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# బి.ఆర్.ఎస్ పార్టీ మెంబర్షిప్ డ్రైవ్ ను విజయవంతం చేయాలి : రేగా




~~హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :~~
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో త్వరలో జరగబోయే బి ఆర్ ఎస్ పార్టీ మెంబర్షిప్ డ్రైవ్ ను విజయవంతం చేయవలసిందిగా పిలుపునిస్తున్నాను. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో ఈ మెంబర్షిప్ డ్రైవ్ విజయవంతం చేయుటకు నాయకులు, కార్యకర్తలు నడుం బిగించవలసిందిగా మిమ్ములను కోరుచున్నాను. తక్షణమే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని ప్రతీ గ్రామపంచాయతీలో జెండాదిమ్మెలకు గులాబీరంగు వేసి దిమ్మెలపై బి ఆర్ ఎస్ పార్టీ స్లొగన్స్ రాయించి, జెండా దిమ్మలను రెడీ చేయవలసిందిగా కోరుచున్నాను. ఈ కార్యక్రమాలలో అన్ని మండలాల అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, టిబి జీ కె యస్ నాయకులు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పిటిసిలు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ పి ఏ సీ ఎస్ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, విద్యార్థి, యువజన నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, ఎస్సీ, ఎస్ టి, బీసీ, మైనారిటీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా నాయకులు, ఉద్యమకారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భాగస్వామ్యులై ఈ మెంబర్షిప్ డ్రైవ్ ను విజయవంతం చేయవలసిందిగా రేగా కాంతారావు బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు.

## పారిశ్రామిక అనుమతులకు వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక అనుమతి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్చించి పరిశ్రమలకు అవసరమైన బొగ్గు, ఇంధన ముడి పదార్థాల కేటాయింపుపై సమీక్ష నిర్వహించి ఒక దరఖాస్తుకు అనుమతి మంజూరు చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకం కింద ఐదు దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించాలని, పరిశ్రమల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, పరిశ్రమల శాఖ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కార్యాలయాల్లో మహిళా వేధింపుల నివారణపై జైనూర్‌లో అవగాహన కార్యక్రమం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోష్ చట్టం (కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ, ఎంపీడీఓ, ఆరోగ్య, పంచాయతీరాజ్, మహిళా-శిశు సంక్షేమ, డీఆర్డీఏ శాఖల మహిళా సిబ్బంది పాల్గొన్నారు. చట్టపరమైన నిబంధనలు, ఫిర్యాదు విధానం, మహిళల హక్కులపై వివరంగా అవగాహన కల్పించారు. జైనూర్ మెడికల్ ఆఫీసర్, సీడీపీఓ తమ అభిప్రాయాలు పంచుకున్నారు. మహిళల భద్రత, గౌరవ పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## వివోఏ ల సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూసస్,3యాదాద్రి** భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో వివోఏ లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ని కలసి వారి సమస్యలను తెలిపారు. వెంటనే సంబంధించిన అధికారులకు ఫోన్ చేసి ఇబ్బందులకు గురి చేస్తూ, సమస్యకు కారణం అవుతున్న వారి పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులను ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి వివోఏ లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సిర్పూర్ టీ మండల సర్పంచ్ సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
సిర్పూర్ టీ మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అజ్మేర ఛత్రు నాయక్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఒడ్డేటి నాగమణి, చాన్కపురీ లావణ్యలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా పిప్రె రాందాస్, నర్గేవర్ రాజు, కోశాధికారిగా రాచెర్ల రజినీ, జాయింట్ సెక్రటరీగా కంట్లం సంతోష్ బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎంపిక చేశారు

# సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్‌లో భారీ మార్పులు!




**కేంద్ర మోటారు వాహనాల నిబంధనల్లో కీలక సవరణలు! ఇథనాల్, బయోడీజిల్ వాడకంపై ప్రభుత్వం ఫోకస్. వాహనాల బరువు పరిమితి పెంపు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, సెంట్రల్ డెస్క్:** పర్యావరణ పరిరక్షణ, ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగాన్ని వేగవంతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్, 1989'కి ప్రతిపాదిత సవరణలను ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు ప్రధానంగా ఇథనాల్, బయోడీజిల్, హైడ్రోజన్ ఇంధనాల వాడకం పై దృష్టి సారించాయి.

ముసాయిదాలో ప్రధాన సవరణలు..

గాలి కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో అధిక ఇథనాల్, బయో ఫ్యూయల్ మిశ్రమ లక్ష్యాలను ప్రతిబింబించేలా సాంకేతిక ఇంధన వర్గీకరణలను అప్‌డేట్ చేశారు. ఇది దేశవ్యాప్తంగా చేపట్టిన ఇ20 (20% ఇథనాల్ మిశ్రమం) రోలౌట్‌కు అనుగుణంగా ఉంటుంది. హైడ్రోజన్ ఇంధన వర్గీకరణను 'హైడ్రోజన్ ౦ సి.ఎన్' నుండి 'హైడ్రోజన్ ౦ సి.ఎన్.జి'గా మార్చారు. ఇది హైడ్రోజన్ ఆధారిత రవాణా వ్యవస్థను మరింత క్రమబద్ధీకరించడానికి దోహదపడుతుంది. అలాగే కొన్ని ఎంపిక చేసిన బి100 స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. దీనివల్ల నూరు శాతం బయోడీజిల్‌ను వినియోగించే వాహనాలకు మార్గం సుగమం కానుంది. ఉద్గార పరీక్షల పారామితులు, సాంకేతిక గుర్తులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రామాణికం చేశారు. ఈ సవరణల వల్ల వాహన తయారీ రంగంలో స్పష్టత రావడంతో పాటు, ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, పర్యావరణ హితమైన ఇంధన విప్లవానికి ఈ ముసాయిదా గట్టి పునాది వేయనుందని విశ్లేషకులు, ప్రకృతి ప్రేమికులు అంచనా వేస్తున్నారు

## డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ సిగరేట్ తాగిన
# రియాన్ పరాగ్.. క్రిమినల్ కేసు..?

**ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్ వేపింగ్ వీడియో వైరల్! డ్రెస్సింగ్ రూమ్‌లో నిబంధనల ఉల్లంఘన. జరిమానాతో పాటు సస్పెన్షన్ పొంచి ఉన్న ముప్పు.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, స్పోర్ట్స్ డెస్క్:** రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చిక్కుల్లో పడ్డాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో పరాగ్ 'వేపింగ్' (ఇ-సిగరెట్ తాగడం) చేస్తున్న దృశ్యాలు ప్రత్యక్ష ప్రసారంలో కెమెరాకు చిక్కాయి. రాజస్థాన్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో 16వ ఓవర్ వద్ద చోటు చేసుకున్న ఈ ఘటన సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో పాటు క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సాధారణంగా స్టేడియం ప్రాంగణం, డ్రెస్సింగ్ రూమ్‌లో ధూమపానం చేయడం ఐసీసీ, బీసీసీఐ నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధం. ఈ ఘటనపై బీసీసీఐ క్రమశిక్షణ కమిటీ విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఇదిలా భారత్‌లో 2019 నుండి ఇ-సిగరెట్ల విక్రయం, వాడకంపై చట్టపరంగా నిషేధం ఉన్న నేపథ్యంలో, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే పరాగ్‌పై భారీ జరిమానాతో పాటు మ్యాచ్ సస్పెన్షన్ విధించే ప్రమాదం ఉంది. అలాగే నిబంధనల ప్రకారం అతని పై క్రిమినల్ కేసు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒక బాధ్యతాయుతమైన కెప్టెన్ హోదాలో ఉండి ఇలాంటి చర్యలకు పాల్పడటంపై నెటిజన్లు, మాజీ క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదంపై రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం లేదా బోర్డు నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



## నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన
# కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా గోలనుకొండ గ్రామంలో ఘనంగా నిర్వహించిన నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన మరియు అభయ ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బీర్ల అనిత కూడా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు, బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు గ్రామంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నవగ్రహ విగ్రహాలు మరియు అభయ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి, భక్తులకు దర్శనార్థం అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గోలనుకొండ ను భక్తి కొండగా మార్చారన్నారు. ప్రజలలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెరగాలంటే దేవాలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం, బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన అతిథి గృహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ అతిథి గృహం గ్రామానికి వచ్చే భక్తులు, సందర్శకులకు సౌకర్యంగా ఉండేలా నిర్మించబడిందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు బీర్ల ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# టాప్ 5లో భారత్: సైనిక శక్తిలో ప్రభంజనం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్ ఏప్రిల్ 29, సెంట్రల్ డెస్క్ :** ప్రపంచవ్యాప్తంగా యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ.. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదని భారత్ నిశ్చయించుకుంది. తన సైనిక సామర్థ్యాన్ని ఆధునీకరించుకుంటూ, రక్షణ రంగంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. తాజాగా స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన గణాంకాలు భారతదేశ పెరుగుతున్న సైనిక ప్రాబల్యాన్ని చాటిచెబుతున్నాయి. భారతదేశం తన రక్షణ రంగాన్ని బలోపేతం చేసే దిశగా భారీ అడుగులు వేస్తోంది. ఎస్.ఐ.పి.ఆర్.ఐ నివేదిక ప్రకారం, 2025లో భారత్ తన సైనిక వ్యయాన్ని 8.9 శాతం పెంచుకుంది. దీంతో మొత్తం వి92.1 బిలియన్ల (సుమారు రూ.7.7 లక్షల కోట్లు) ఖర్చుతో ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద సైనిక వ్యయం చేసే దేశంగా భారత్ అవతరించింది. చైనా, అమెరికా వంటి అగ్రరాజ్యాల మధ్య భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం దేశ రక్షణ సన్నద్ధతకు నిదర్శనం.

**మే 2025 ఘర్షణలు.. పెరిగిన అప్రమత్తత..**

2025 మే నెలలో భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో తలెత్తిన ఉద్రిక్తతలు ప్రాంతీయ సైనిక వ్యయం పెరగడానికి ప్రధాన కారణంగా నిలిచాయి. యుద్ధ విమానాలు, ఆధునిక డ్రోన్లు, క్షిపణి వ్యవస్థల కొనుగోలుపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇదే సమయంలో పొరుగు దేశమైన పాకిస్తాన్ కూడా తన వ్యయాన్ని 11 శాతం పెంచి వి11.9 బిలియన్లకు చేర్చింది. చైనా నుండి కొత్త యుద్ధ విమానాలు, క్షిపణుల ఆర్డర్లు, పాత బకాయిల చెల్లింపుల వల్ల పాకిస్తాన్ ఖర్చు పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది.

**ప్రపంచ సైనిక వ్యయంలో పెను మార్పులు**

ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం వరుసగా 11వ సంవత్సరం కూడా వృద్ధి చెంది రికార్డు స్థాయిలో వి2.89 ట్రిలియన్లకు చేరింది.

**అగ్రస్థానంలో అమెరికా:** ఉక్రెయిన్‌కు సహాయం తగ్గడంతో అమెరికా వ్యయం 7.5 శాతం తగ్గి వి954 బిలియన్లకు చేరినప్పటికీ, అది ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యధికం.

రెండో స్థానంలో చైనా: వరుసగా 31వ సంవత్సరం కూడా చైనా తన బడ్జెట్‌ను పెంచుకుంటూ వి336 బిలియన్లకు చేర్చింది.

**మూడో స్థానంలో రష్యా:** ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యా రక్షణ వ్యయం కోసం వి190 బిలియన్లను కేటాయించింది.

**నాలుగో స్థానంలో జర్మనీ:** జర్మనీ తన సైనిక వ్యయాన్ని 24 శాతం మేర భారీగా పెంచింది. తద్వారా దాని రక్షణ వ్యయం వి 114 బిలియన్లకు చేరింది

**ప్రతి వ్యక్తిపై రక్షణ భారం**

ప్రపంచ దేశాలన్నీ తమ బడ్జెట్‌లో సగటున 6.9 శాతం సైన్యానికే కేటాయిస్తున్నాయి. అంటే ప్రపంచంలో ఉన్న ప్రతి వ్యక్తి రక్షణ కోసం సగటున వి352 ఖర్చవుతోంది. ప్రపంచ దేశాల మొత్తం జీడీపీలో 2.5 శాతం కేవలం రక్షణ కోసమే వినియోగిస్తున్నారు. 2009 తర్వాత ఈ స్థాయిలో సైనిక భారం పెరగడం ఇదే మొదటిసారి.

**పాక్ 31వ స్థానంలో..**

దేశ భద్రత విషయంలో పాకిస్థాన్ 31వ స్థానంలో నిలిచింది. పాక్ తన సైనిక వ్యయాన్ని 11 శాతం పెంచి 11.9 బిలియన్ డాలర్లకు చేర్చింది. పాక్‌తో పోలిస్తే భారత సైనిక వ్యయం దాదాపు 9 రెట్లు అధికం.

**భవిష్యత్తు అంచనాలు**

గాజా యుద్ధం ముగియడంతో ఇజ్రాయెల్ వ్యయం 4.9 శాతం తగ్గగా, ఇరాన్ ఖర్చు కూడా వరుసగా రెండో ఏడాది క్షీణించింది. అయితే, 2026 సంవత్సరానికి అమెరికా నిధులు ఇప్పటికే వి1 ట్రిలియన్‌ను దాటేశాయి. దీన్ని బట్టి చూస్తుంటే ప్రపంచవ్యాప్తంగా ఈ ఆయుధ పోటీ మరియు సైనిక వ్యయ ధోరణి 2026లో కూడా కొనసాగే అవకాశం ఉందని ఎస్.ఐ.పి.ఆర్.ఐ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




# పాకిస్థాన్ ప్రభుత్వం, ఆర్మీని లేపేస్తాం.. అల్ ఖైదా సంచలన వార్నింగ్..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29 :**
గత కొంతకాలంగా పాకిస్థాన్- అఫ్గానిస్తాన్ మధ్య దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. అఫ్గానిస్తాన్ పై ఇటీవల పాకిస్థాన్ దాడులను వేగవంతం చేసిన నేపథ్యంలో అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అయిన అల్ ఖైదా పాకిస్థాన్ కు సంచలన వార్నింగ్ ఇచ్చింది. అఫ్గానిస్తాన్ ప్రభుత్వంలోని తాలిబాన్ ప్రభుత్వానికి తమ సపోర్ట్ ఉంటుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్ మిలిటరీ.. అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెంచడం మానుకోవాలని వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు సాహబ్ మీడియా ద్వారా రెండు పేజీల లేఖను విడుదల చేసింది. అలాగే పశ్చిమాసియా దేశాలతో పాకిస్థాన్ చనువుగా ఉండటం.. ఇరాన్- అమెరికా యుద్ధంలో మధ్యవర్తిత్వం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది అల్ ఖైదా.అలాగే పాకిస్థాన్ ప్రభుత్వ ఆదేశాలను ఎవరూ పాటించొద్దని ప్రజలు, ఆర్మీకి కూడా పలు సూచనలు చేసింది అల్ ఖైదా ఉగ్రవాద సంస్థ. అంతేకాక తమ జిహాదీ లక్ష్యాలకు మద్దతు ఇవ్వాలని కోరింది. ఇక పాకిస్థాన్ ప్రభుత్వం ప్రస్తుతం ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ నేతృత్వంలో పాశ్చాత్య దేశాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని అల్ ఖైదా సంస్థ మండిపడింది. తాలిబాన్ ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని.. అఫ్గానిస్తాన్ విషయంలో ఎలాంటి జోక్యం చేసుకున్నా తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ మేరకు లేఖలో స్పష్టం చేసింది. పాకిస్థాన్- అఫ్గానిస్తాన్ సరిహద్దుగా డురాండ్ లైన్ ఉన్న విషయం తెలిసిందే. అయితే డురాండ్ లైన్ విషయంలో పాకిస్థాన్-అఫ్గానిస్తాన్ మధ్య తీవ్రమైన ఘర్షణలు జరుగుతున్నాయి. పాకిస్థాన్ సైన్యం అఫ్గానిస్తాన్ భూభాగంలో వైమానిక దాడులకు పాల్పడుతుండగా అటు తాలిబన్లు కూడా పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఎదురుదాడికి పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ కు అల్ ఖైదా సంచలన వార్నింగ్ ఇవ్వడంతో అక్కడి పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఆ దేశంలో ఆర్థిక పరిస్థితి అతలాకుతలం అవుతోంది. పాకిస్థాన్ లో ప్రస్తుతం లాక్ డౌన్ పరిస్థితులు ఉన్నాయి. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో అల్ ఖైదా నుంచి ఇలాంటి వార్నింగ్ రావడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

# పదో తరగతిలో 98% ఫలితాలు... గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల విజయానికి సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని తెలంగాణా గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం (టీఎస్‌టీడబ్ల్యూటీయూ) జిల్లా కార్యవర్గం బుధవారం డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించింది.ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి, పిఎంఆర్‌సి ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్‌లను శాలువాలతో సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల కృషికి సంఘం అభినందనలు తెలిపింది. జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ – ఈ ఫలితాలు గిరిజన విద్యకు శుభసూచకమని, రాబోయే కాలంలో జిల్లా ఆశ్రమ పాఠశాలలను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బ్రిలియంట్ హై స్కూల్‌లో ద్విగుణ విజయం - సంకీర్తన, మేఘన ఘన సన్మానం

**ఆనందం వ్యక్తం చేసిన కరస్పాండెంట్ వకంతుల అప్పారావు**



**హైదరాబాద్ పల్స్ ఏప్రిల్ 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** డోర్నకల్ పట్టణంలోని బ్రిలియంట్ హై స్కూల్ పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి విజయ పతాకాన్ని ఎగురవేసింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఆనందోత్సాహ వాతావరణం నెలకొంది. ఈ ఫలితాల్లో విద్యార్థిని యం. సంకీర్తన 600 మార్కులకు 580 మార్కులు సాధించి టాప్ స్థానాన్ని కైవసం చేసుకోగా, జే. మేఘన 572 మార్కులు సాధించింది డోర్నకల్, మండలాల్లో ప్రథమ స్థానంలో సంకిర్తన నిలిచి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చింది. వారి ప్రతిభను గుర్తిస్తూ పాఠశాల కరస్పాండెంట్ వకంతుల అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఇద్దరు విద్యార్థినులను ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి, శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్సర బేగం, ఉపాధ్యాయులు శ్రీనివాస్ మరియు ఇతర సిబ్బంది పాల్గొని విద్యార్థుల కృషిని ప్రశంసించారు. కష్టపడి చదివితే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఈ విజయానికి కారణమని వెల్లడించింది.

# వివాహ వేడుకలో వధూవరులకు పూలే దంపతుల చిత్రాలు బహూకరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం డబ్బా బారేగుడ గ్రామంలో జరిగిన దినేష్--ఝాన్సీ వివాహ వేడుకల్లో మాలి సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రాలను అందజేశారు. మండల అధ్యక్షుడు నికొడే సందీప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాలి సంఘం ప్రతినిధులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ప్రతి ఇంట్లో మహనీయుల చిత్రాలు ఉంచుకోవాలని, గ్రామాల్లో వారి విగ్రహాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

# సంక్షోభం వేళ భారత్‌కు భారీ గుడ్‌న్యూస్.. హర్మూజ్‌తో పనిలేకుండానే చౌకగా ముడి చమురు!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29 :**
అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో ఊహించని మార్పులు చోటుచేసుకుందటున్నాయి. చమురు ఉత్పత్తి దేశాల శక్తివంతమైన కూటమి ఓపెక్ నుంచి వైదొలగాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రానుంది. ఈ పరిణామం ప్రపంచ చమురు రాజకీయాలను మార్చడమే కాకుండా, భారత్ వంటి పెద్ద చమురు దిగుమతి దేశాలకు భారీ ఊరటనిచ్చే అవకాశం ఉంది.

**భారత్‌కు భారీ ఊరట..**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఓపెక్ నుంచి బయటకు రావడం వల్ల భారత్‌కు ప్రధానంగా రెండు ప్రయోజనాలు కలుగనున్నాయి. ఇప్పటివరకు ఓపెక్ నిర్దేశించిన కోటా కారణంగా యూఏఈ తన సామర్థ్యం మేరకు చమురును ఉత్పత్తి చేయలేకపోయింది. ఇప్పుడు ఆ ఆంక్షలు ఉండవు కాబట్టి, యూఏఈ చమురు ఉత్పత్తిని భారీగా పెంచుతుంది. సరఫరా పెరిగితే అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గే అవకాశం ఉంది. భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 9 నుంచి 10 శాతం యూఏఈ నుంచే దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, ఇది దేశ ఇంధన బిల్లును తగ్గిస్తుంది. అదేవిధంగాప్రస్తుతం ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల వల్ల హోర్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం ఈ ఇరుకైన మార్గం గుండానే సాగుతుంది. అయితే, యూఏఈకి 'హబ్షాన్-ఫుజైరా' పైప్‌లైన్ ఉంది. ఈ పైప్‌లైన్ అబుదాబి నుంచి నేరుగా ఒమన్ గల్ఫ్‌లోని ఫుజైరా ఓడరేవు వరకు చమురును తీసుకెళుతుంది. దీంతో హోర్ముజ్ జలసంధితో సంబంధం లేకుండానే యూఏఈ చమురును అరేబియా సముద్రం ద్వారా నేరుగా భారత్‌కు పంపే అవకాశం ఉంది. యుద్ధం వంటి పరిస్థితుల్లో కూడా భారత్‌కు చమురు సరఫరా ఆగిపోయే ప్రమాదం కూడా ఉండదు.

**యూఏఈ నిర్ణయానికి కారణం ఇదే..**


యూఏఈ తన చమురు ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 50 లక్షల బ్యారెళ్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, సౌదీ అరేబియా నేతృత్వంలోని ఓపెక్ కూటమి ధరలను స్థిరీకరించే పేరుతో ఉత్పత్తిపై ఆంక్షలు విధిస్తోంది. ఇది తమ ఆర్థిక ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారిందని యూఏఈ భావించింది. అందుకే సొంత నిర్ణయాలు తీసుకునేందుకు 60 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకుంది. ఇక భారత్ చమురు దిగుమతుల్లో యూఏఈ వాటా సుమారు 11.4 శాతంగా ఉంది. సుమారు 400 కి.మీ పొడవైన హబ్షాన్-ఫుజైరా లైన్ ద్వారా ఇంధనం సురక్షితంగా సరఫరా భారత్ చేరనుండటంతో ఆర్థిక భారం తగ్గి దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది.

# వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఊరికొచ్చిన బాలుడు నీటి కుంటలో పడి మృతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అరెగూడకు చెందిన చింటూ అనే బాలుడు పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామంలో నీటి కుంటలో పడి మృతి చెందాడు.వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన చింటూ మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లి రాత్రి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టగా బుధవారం ఉదయం సమీపంలోని నీటి కుంటలో విగతజీవిగా కనిపించాడు.వేసవి కాలంలో పిల్లలు నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు హెచ్చరిస్తున్నారు

# పది ఫలితాల్లో 560 మార్కులు సాధించిన విద్యార్థిని నల్ల గేహాళశ్రీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కళాకారుడు మాజీ విద్యాకమీటి చైర్మన్ కీ,శే నల్ల కృష్ణ స్వామి కుమార్తె నల్ల గేహాళశ్రీ మోటకొండూరు మండలంలోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని బుధవారం వెల్లడించిన పదవతరగతి ఫలితాల్లో గేహాళశ్రీ 560 మార్కులు సాధించింది. తన తండ్రి కలలు కన్న ఉన్నత విద్య అభ్యాసనం కోసం కష్టపడి మంచి మార్కులు సాధించి తొలిమెట్టు ఎక్కిన గేహాళను పలువురు అభినందించారు.

# కర్ణాటకలో మైండ్ బ్లాంక్ అయ్యే ఘటన.! 3,127 గర్భిణీలు మిస్సింగ్.!



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 29, సెంట్రల్ డెస్క్ : కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో బయటపడిన గర్భస్థ శిశువుల అదృశ్యం ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. వేలాది గర్భిణీ స్త్రీల నమోదులు, ప్రసవాల గణాంకాల్లో భారీ తేడాలు బయటపడటంతో, దీని వెనుక వ్యవస్థీకృతంగా జరుగుతున్న అక్రమ ఆడ భ్రూణహత్యలపై అనుమానాలు బలపడుతున్నాయి. ఆరోగ్య శాఖ రికార్డులు, నేలస్థాయి వాస్తవాల మధ్య ఉన్న ఈ వ్యత్యాసం ఆరోగ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ సంచలన అంశం మొదటగా ప్రముఖ దినపత్రిక మార్చి 18న ప్రచురించిన కథనంతో వెలుగులోకి వచ్చింది. యాదగిరిలో కేవలం ఏడు నెలల్లోనే సుమారు 30 ఆడ భ్రూణహత్యలు జరిగాయని ఆ నివేదిక పేర్కొనడం సంచలనం సృష్టించింది. ఈ వార్తపై స్పందించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూ రావు, ముఖ్య కార్యదర్శి హర్ష గుప్తా తక్షణమే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కమిటీ ప్రాథమిక విచారణలోనే అనేక అనుమానాస్పద అంశాలను గుర్తించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అక్రమ స్కానింగ్ సెంటర్లు, నకిలీ వైద్యుల నెట్‌వర్క్, డేటా మానిప్యులేషన్ వంటి అంశాలు ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్నాయనే సంకేతాలు వెలువడ్డాయి. ఆరోగ్య శాఖ రహస్య నివేదిక ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. మొత్తం 31,435 మంది గర్భిణీలు నమోదవ్వగా, 26,584 సజీవ జననాలు, 188 శిశు మరణాలు, 207 ప్రసవాలు పెండింగ్‌గా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అలాగే 1,329 గర్భస్రావాల కేసులు నమోదయ్యాయి. అయితే ఈ లెక్కలన్నింటినీ కలిపితే 28,308 మాత్రమే అవుతుండగా, మిగతా 3,127 కేసులు గల్లంతవడం అనుమానాలకు తావిస్తోంది. అదే సమయంలో, ఏప్రిల్ నుంచి నవంబర్ 2025 వరకు అధికారికంగా 652 అబార్షన్ కేసులు నమోదు కాగా, యాదగిరి జిల్లాలో అబార్షన్ రేటు 3.16%గా ఉండటం కూడా ప్రశ్నలు రేపుతోంది. ఇది రాష్ట్ర సగటు 5.24% కంటే తక్కువగా ఉండటం గమనార్హం. ఈ వ్యత్యాసం డేటా దాచిపెట్టడం లేదా అక్రమ చర్యలకు సంకేతంగా అధికారులు భావిస్తున్నారు. ఇక క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య సిబ్బంది లక్ష్యాలు చేరుకోవడం కోసం నకిలీ ప్రసూతి కార్డులు సృష్టించి ఉండవచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలను గుప్తంగా నిర్వహించి, ఆడ శిశువుల గర్భాలను అక్రమంగా తొలగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో (గర్భధారణ పూర్వ మరియు ప్రసవ పూర్వ నిర్ధారణ పద్ధతుల చట్టం) అమలు ఎంతవరకు జరుగుతోంది అన్నదానిపై కూడా చర్చ మొదలైంది. జిల్లా కలెక్టర్ హర్షల్ భోయార్ స్పందిస్తూ, రాష్ట్ర స్థాయి కమిటీ ఇప్పటికే జిల్లాలో పర్యటించి కీలక ఆధారాలను సేకరించిందని తెలిపారు. అక్రమ స్కానింగ్ సెంటర్లు, నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి అబార్షన్ కేసును సవివరంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. ఈ ఘటన యాదగిరి జిల్లాకే పరిమితమా ? లేక రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. ఆరోగ్య వ్యవస్థలో ఉన్న లోపాలు, పర్యవేక్షణలో నిర్లక్ష్యం, సామాజికంగా ఇంకా కొనసాగుతున్న లింగ వివక్ష.. కలిసి ఈ పరిస్థితికి దారితీసాయా అన్న కోణంలో విచారణ కొనసాగుతోంది. విచారణ నివేదిక బయటకు వచ్చిన తర్వాతే ఈ 'నిశ్శబ్ద హత్యాకాండ' వెనుక అసలు నిజాలు, బాధ్యులు ఎవరు అన్నది స్పష్టమవుతుంది. అయితే ఈ ఘటన ఒక విషయం మాత్రం స్పష్టంగా చెబుతోంది. ఆడ శిశువుల రక్షణ కోసం చట్టాల అమలుతో పాటు, సమాజంలో అవగాహన పెంపు అత్యవసరం.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.